క్లుప్తంగా

డిజిటల్ తరగతులతో మేలు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డిజిటల్ తరగతులతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంఈఓ త్రినాథరావు అన్నారు. మండలంలోని విజయరాంపురం ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, డిజిటల్ తరగతుల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అలాగే పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించేందుకు డిజిటల్ తరగతులను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

రామభద్రపురం: గ్రామాల పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులు గతకొన్ని రోజులుగా సమ్మె చేయడంతో వీధుల్లో చెత్తపోగులు పేరుకుపోయాయి. దీనిపై ఈఓపీఆర్డీ వెంకటరమణ, ఇన్‌చార్జి ఈఓ రవితో శుక్రవారం ఎంపీపీ ప్రత్యేకంగా మాట్లాడారు. పారిశుద్ధ్య లోపంతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వీలైనంత త్వరగా కార్మికులతో చర్చించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

ఎండీయూ వాహనాల్లో పుస్తకాల సరఫరా

రామభద్రపురం: మండలంలోని అన్ని పాఠశాలలకు సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలను ఎండీయూ వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు ఎంపీడీఓ రమామణి, ఎంఈఓ తిరుమల ప్రసాద్ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఉన్న మండల స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జగనన్న విద్యా కానుక కిట్లను స్టాక్ పాయింట్ వద్దే ఉపాధ్యాయులకు అందించేవాళ్లమని, వాటిని తరలించేందుకు వారు ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎండీయూ వాహనాల ద్వారా పాఠశాలలకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

రేజేరు పాఠశాల పరిశీలన

బాడంగి: మండలంలోని రేజేరు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–2 ఎం.రాజేశ్వరి శుక్రవారం సందర్శించారు. ప్రార్థన సమయానికి వెళ్లి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీలు తనిఖీ చేశారు. హెచ్‌ఎం లలితతో పాటు తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాల పరిసరాలు, మౌలిక సౌకర్యాలు, నాడు–నేడు పనులు, మరుగుదొడ్లు, తదితర వాటిపై ఆరాతీశారు.

తాగునీటి పైపులైన్ పునరుద్ధరించాలి

తెర్లాం: మండలంలోని అరసబలగ గ్రామంలో తాగునీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్ పూర్తిగా మురుగునీటిలో కూరుకుపోయిందని, పైపులైన్ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధికారులకు సూచించారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణతో కలిసి శుక్రవారం ఆమె గ్రామంలో పర్యటించి పైపులైన్‌ను పరిశీలించారు. పైపులైన్ మార్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి తనకు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావుకు సూచించారు. గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతుడు లక్ష్మణరావు

కూర్మన్నపాలెం: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం తాజంగి గ్రామానికి చెందిన యామలపల్లి లక్ష్మణరావు (28) కూర్మన్నపాలెంలో నిర్మితమవుతున్న ఎంవీవీ అండ్ ఎంకే పార్కు అపార్ట్‌మెంట్స్‌లో పది నెలలుగా ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అల్లిపురంలోని బంగారుమెట్టలో సోదరుడు యామలపల్లి రామకృష్ణ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం విధులకు హాజరైన లక్ష్మణరావు ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై, ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి అన్నయ్య యామలపల్లి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పండ్లతోటల పెంపకంపై ఆసక్తి

రేగిడి: పండ్లతోటల పెంపకంపై రైతులు ఆసక్తిగా ఉన్నారని ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. మండలంలోని కోడిశ గ్రామంలో పురుషోత్తంరావు అనే రైతుకు ఉపాధి ద్వారా అందించిన కొబ్బరి మొక్కలను శుక్రవారం పరిశీలించారు. రైతుకు 120 మొక్కలను అందించినట్లు ఏపీఓ చెప్పారు. మండలంలోని రైతులకు జీడిమామిడి, మామిడి తదితర మొక్కలను ప్రభుత్వం రాయితీపై ఇస్తోందన్నారు. రైతులు వాటిని పెంచుకుని లబ్ధిపొందాలని సూచించారు.

‘జగనన్న సురక్ష’ ఓ వరం


బొబ్బిలి: 14వ వార్డు సచివాలయంలో అర్జీదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

• ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ సరైన ధ్రువీకరణ పత్రాలు లేక పథకాలు పొందలేనివారికి ‘జగనన్న సురక్ష’ ఒక వరమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మున్సిపాలిటీ పరిధి 14వ వార్డులో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు, అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు వర్తింప చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ కృష్ణారావు, బుడా చైర్మన్ ఇంటి పార్వతీగోపాలరావు, కౌన్సిలర్ పి.ఉమాశంకరరావు, ఏఎస్‌ఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

• **రేగిడి:** జగనన్న సురక్ష కార్యక్రమంతో ఎన్నో సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎంపీడీఓ నాగమణి అన్నారు. మండలంలోని నాయిరాలవలస గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని అర్జీదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. అలాగే లింగాలవలస గ్రామంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్జాన అప్పలనాయుడు, ఎంపీటీసీ రెడ్డి నర్సింగరావు, మాజీ ఎంపీటీసీ కొవ్వాడ శ్రీరాములు, వావిలపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

– **రాజాం:** మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కే.రాజు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రేగిడి: నాయిరాలవలసలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ నాగమణి


రాజాం: గార్రాజుచీపురుపల్లిలో దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ఎస్.కె.రాజు

కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్మికుల సమ్మె


కార్మికుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న తమ్మినేని సూర్యనారాయణ

రామభద్రపురం: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకుడు బలస శ్రీను ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కార్మికులు చేపట్టిన రిలేనిరాహార దీక్షకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ 20 రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెను ఉద్ధృతం చేస్తామని తెలిపారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రవీణ్

రాజాం సిటీ: బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని ఎంఈఓలు ప్రవీణ్, దుర్గారావు అన్నారు. పట్టణంలోని ఎస్సీ కాలనీ, మెంటిపేటలో బడికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్న ప్రత్యేక అవసరాలు కలిగిన ఇద్దరు చిన్నారులను గుర్తించారు. శుక్రవారం వారి ఇంటికి వెళ్లి పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతీ చిన్నారిని బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిన్నారుల వివరాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రశస్త యాప్‌లో పొందుపర్చుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.హరిబాబు, వి.శ్రీనివాసరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

• సీఐ తిరుమలరావు


మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

తెర్లాం: సైబర్ నేరాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు సచివాలయ మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై ఆర్.రమేష్ ఆధ్వర్యంలో సచివాలయ మహిళా పోలీసులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, కావున ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు నేరగాళ్ల ఉచ్చులో పడకుండా వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలు, కొట్లాటలు, గొడవలు జరిగినా వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. దిశ చట్టం, యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించాలని, వారి స్మార్ట్ ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలన్నారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తం


అటవీశాఖ సిబ్బంది, ట్రాకర్స్‌తో మాట్లాడుతున్న ఎస్సై ఆర్.రమేష్

తెర్లాం: మండలంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు జనవాసాల మధ్యకు రాకుండా అటవీశాఖ అధికారులు, సిబ్బంది, ట్రాకర్స్ చూడాలని ఎస్సై ఆర్.రమేష్ అన్నారు. మండలంలోని కొరటాం గ్రామంలోకి ఏనుగుల గుంపు సంచరిస్తోందన్న సమాచారం మేరకు శుక్రవారం ఉదయం గ్రామానికి వెళ్లి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. అటవీశాఖ అధికారులు, ట్రాకర్స్‌తో ఎస్సై మాట్లాడారు. ఏనుగులు గ్రామాల్లోకి చొరబడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. ఏనుగులు సంచారంపై పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఏనుగుల కారణంగా గ్రామాల్లో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన చెప్పారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది, ట్రాకర్స్‌కి ప్రజలు సహకరించాలని, వారు చెప్పిన విధంగా నడచుకోవాలని సూచించారు.

పక్కాగా ఓటరు జాబితాల రూపకల్పన

• ప్రారంభమైన బీఎల్‌ఓల ఇంటింటి సర్వే
• నెల రోజుల పాటు ఓటర్ల వివరాల పరిశీలన


రామభద్రపురం: చొక్కాపువీధిలో బీఎల్‌ఓలు చేస్తున్న సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజారావు


సంతకవిటి: ఇంటింట సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎ.సులోచనారాణి


వంగర: బీఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ డి.ఐజాక్

బాడంగి/రామభద్రపురం/సంతకవిటి/వంగర: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాల్లో తప్పులను సరిచేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు నెలరోజుల పాటు అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి కుటుంబంలో ఉన్న ఓటర్ల వివరాలు సరిగా ఉన్నాయా లేదో పరిశీలించనున్నారు. మృతి చెందిన, ఇతర ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పర్చుకున్న ఓటర్ల వివరాలను కుటుంబ సభ్యుల అనుమతితో జాబితాల నుంచి తొలగించనున్నారు. అదేవిధంగా ఓటరు పేరు, అడ్రస్, ఇతర వివరాల్లో ఏమైనా మార్పులు చేర్పులతో పాటు 18 సంవత్సరాలు నిండిన యువతకు జాబితాలో చోటు కల్పించనున్నారు. ఒక ఇంట్లో ఉన్న ఓటర్లందరూ ఒకే పోలింగ్ బుత్ పరిధిలోకి వచ్చేలా చర్యలు చేపట్టనున్నారు. బాడంగిలో చేపట్టిన సర్వేను తహసీల్దార్ ఎ.రఫీజాన్, రామభద్రపురంలో తహసీల్దార్ రాజారావు, సంతకవిటి మండలంలో తహసీల్దార్ ఎ.సులోచనారాణి, వంగరలో తహసీల్దార్ డి.ఐజాక్ బీఎల్‌ఓలు చేపట్టిన సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు.

సంక్షిప్తంగా..

జయప్రకాశరావు మాస్టారు మృతికి సంతాపం

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామానికి చెందిన ఎంపీటీసీ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు సోదరుడు జయప్రకాశరావు మాస్టారు కుటుంబాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పరామర్శించారు. కూనాయవలసలో జయప్రకాశరావు మాస్టారు పెద్దకర్మను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాస్టారు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు,పార్టీ నాయకులు ఉన్నారు.

చురుగ్గా కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

రాజాం సిటీ: రాజాం రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్‌శాఖ అధికారులు కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. స్థానిక పాలకొండ రోడ్డులో శుక్రవారం కొత్త స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ కుమార్ మాట్లాడుతూ విస్తరణ పనులకు ఇబ్బందులు లేకుండా పనులు వేగవంతం చేపడుతున్నామన్నారు.

గిరిజన సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

బొబ్బిలి: ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ రమేష్, కార్యదర్శిగా తాడంగి ఎండుదొర, మరో పదిమంది సభ్యులను ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ తెలిపారు.

నూతన తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

వంగర: తహసీల్దార్ కార్యాలయానికి పూర్తిస్థాయిలో ఫర్నిచర్ మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ తెలిపారు. నూతనంగా ప్రారంభించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఫర్నిచర్ సమకూర్చేందుకు అవసరమైన నిధులు కేటాయించేలా ఉన్నతాధికారులను కోరనున్నట్లు చెప్పారు. తహసీల్దార్ డి.ఐజాక్, డీటీ బూరాడ సుందరరావు, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

నేడు ఆర్‌బీకే ప్రారంభం

రామభద్రపురం: మండల కేంద్రంలో సచివాలయం–1 పరిధిలో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా శనివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ రమామణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

అంధుల పాఠశాలకు దుస్తుల వితరణ

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ గట్టి పాపారావు, పద్మావతి దంపతులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి చేతులమీదుగా రూ.15వేలు విలువ చేసే దుస్తులను భీమిలి అంధుల పాఠశాలకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో అమనాన నీలకంఠం, వాకచర్ల పైడిరాజు, డొంక త్రినాథులు, గడే అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

రాజాం: పట్టణంలోని గాయత్రీకాలనీ రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. రోడ్డు పక్కన ఉన్న షాపుల యజమానులతో మాట్లాడారు. నష్టపరిహారం చెల్లించనప్పటికీ కొలతల మేరకు దుకాణాలు తొలగించని వారికి నోటీసులు జారీచేశారు. త్వరితగతిన రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు.

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్

రాజాం: రాజాంలోని వరలక్ష్మీ సెయింటాన్స్ స్కూల్ వద్ద శుక్రవారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. విద్యార్థులు ప్రధానమంత్రి, పలువురు కేబినెట్ మంత్రులు, లోక్ సభ సభ్యుల వేషాధారణలో ఆకట్టుకున్నారు. పార్లమెంటరీ సమావేశాల్లో మాదిరిగా వివిధ అంశాలపై చర్చించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లార్డ్ మేరీ, సిస్టర్ సిసిలియన్ విద్యార్థులను అభినందించారు.

వీఆర్‌ఏల నిరసన

రేగిడి: వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు రెండో రోజు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ఈసర్ల జగన్, ఉపాధ్యక్షుడు పక్కి పాదాలరావు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పాలన


ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బాడంగి: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పాల్తేరు గ్రామంలో రెండోరోజు శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీటీసీ వంగపండు దివ్య, రమేష్, సొసైటీ అధ్యక్షుడు ఉడమల అప్పలనాయుడు, త్రినాథనాయుడు, బొత్స లక్ష్మునాయుడు, అల్లు బలరాం, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని వినతి

బొబ్బిలి: కోమటిపల్లి గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. పిల్లలను ప్రైవేటు కళాశాలలకు పంపించే స్తోమత లేదని, పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లయితే గ్రామీణ ప్రాంతంలో ఉన్న పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి పాఠశాలను అప్‌గ్రేడ్ చేసేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యాజమాన్య కమిటీ చైర్మన్ టి.శ్రీనివాసరావు, సభ్యులు ఎ.లక్ష్మణరావు, ఆర్.అప్పలనాయుడు, ఎస్.శంకరరావు, పి.భవాని, అప్పలనాయుడు ఉన్నారు.

యాప్‌లో వివరాలు పొందుపర్చాలి


మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న సీసీ సింహాచలం

వంగర: మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యుల వివరాలు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన లోకో యాప్‌లో నమోదు చేయాలని కొప్పర క్లస్టర్ కో–ఆర్డినేటర్ గుంట సింహాచలం అన్నారు. మండలంలోని కొప్పర, కొండచాకరాపల్లి, కె.కొత్తవలస, కొప్పరవలస గ్రామాల్లో గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వీఓఏలు, మహిళా సంఘాలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ప్రాజెక్టులో భాగంగా సంఘంలోని సభ్యుల వివరాలను వీఓలు లోకోయాప్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

నీటిపన్ను వసూళ్లు వేగవంతం


మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: పట్టణంలోని అన్ని వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న నీటిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక కార్యాలయంలో వార్డు సచివాలయ అడ్మిన్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వస్తున్న అర్జీలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అడ్మిన్లదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు, ఆర్‌ఐ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపర్చాలి


మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణదొర


విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ ప్రవీణ్‌కుమార్

బాడంగి: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు కృషిచేయాలని ఎంఈఓ పి.లక్ష్మణదొర సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని హెచ్‌ఎంలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. నాడు–నేడు పనులు, డిజిటల్ తరగతుల నిర్వహణపై సమీక్షించారు. వచ్చే నెల మొదటి వారంలో సమ్మెటివ్–1 పరీక్షలు ఉన్నందున ప్రణాళిక ప్రకారం సిలబస్ పూర్తిచేసి పిల్లలను పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ఎంఈఓ–2 రాజేశ్వరి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

టీఎల్‌ఎంతో బోధించాలి

రాజాం: ఉపాధ్యాయులు టీఎల్‌ఎంతో పాఠాలను బోధిస్తే విద్యార్థులు ఆసక్తిగా వింటారని ఎంఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మెంతిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. బోధనా పద్ధతుల్లో సాంకేతికతను వినియోగించాలని సూచించారు. హెచ్‌ఎం ప్రసాదరావు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: మున్సిపాలిటీలోని 11 సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 21 వార్డు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ డీటీవీ కృష్ణారావు శుక్రవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 22 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బుచ్చెంపేట 2, పానుగుటివలస 3, సత్యనారాయణపురం 2, మిర్తిరెడ్డివీధి 2, లచ్చయ్యపేట(1) 4, లచ్చయ్యపేట(2) 1, మాదిగవీధి 1, ఆదర్శనగర్ 1, కొత్తవలస 3, కొండపేంట 2 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

టోఫెల్‌పై ఒక్కరోజు శిక్షణ

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న టోఫెల్ కార్యక్రమంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి శిక్షణ కార్యక్రమానికి బొబ్బిలి డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంతో అమెరికా దేశస్తుల మాదిరిగా ఆంగ్ల ఉచ్చారణతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వై.దుర్గారావు, హెచ్‌ఎం పి.నాగయ్య, రిసోర్స్ పర్సన్లు ఆర్‌వీజే నాయుడు, ఎ.దామోదరరావు, ఎస్.జయకృష్ణ, బి.రాజేశేఖర్ పాల్గొన్నారు.